క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



రవాణా శాఖ ఉద్యోగుల సంఘ డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయవాడ స్పోర్ట్స్: రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోన్-2 డైరీని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.పురేంద్ర డీటీసీ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ డైరీలో పొందుపర్చిన ప్రభుత్వ జీఓలు, సర్క్యులర్లు ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా పురేంద్ర తెలిపారు. రవాణ శాఖ ఉద్యోగుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఈ డైరీని రూపొందించామని ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓలు ఆర్.జగదీశ్వరరాజు, ఆర్.ప్రవీణ్, ట్రైనీ ఆర్టీఓలు సునీల్, చందన, మనీషా, సంఘ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, నాగమురళి, ఉషాసుందరి పాల్గొన్నారు.

కరాటే పోటీలకు ధన్యత, మహత్రు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే 66వ జాతీయ కరాటే పోటీలకు విజయవాడ క్రీడాకారులు పి.ధన్యత, వై.మహత్రు ఎంపికయ్యారు. ఇటీవల ఒంగోలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల పోటీలకు ధన్యత, అండర్-19 బాలుర పోటీలకు మహత్రు ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో ఇద్దరు క్రీడాకారులు బంగారు పతకం సాధించడంతో పాటు ఆ తరువాత నిర్వహించిన రాష్ట్ర జట్ల ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి, జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ధన్యత నారాయణ వాగ్దేవి కాలేజీలో ఇంటర్ చదువుతుండగా, మహత్రు డీలీ పబ్లిక్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతున్నాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కోచ్ జె.ఎం.దాస్, ఇనస్ట్రక్టర్లు సతీష్, ఆరిఫ్, రవి ఐకాన్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

ప్రత్యేక హోదాపై మోసం చేసిన వారికి బుద్ధి చెప్పండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసిన వారికి బుద్ధి చెప్పాలని ప్రత్యేక హోదా సాధన సమితి, విద్యార్థి యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ అనంతపురం నుంచి ఇచ్చాపురం వరకు చేపట్టిన సమరయాత్ర సోమవారం నగరానికి చేరింది. యాత్ర బస్సుకు బెంజిసర్కిల్ వద్ద ప్రజా సంఘాల నాయకులు, వామపక్ష నేతలు, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు అధ్యక్షత సభ నిర్వహించారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సి.హెచ్.బాబురావు, సీపీఐ కేంద్ర కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలకు 205 మంది హాజరు



పటమట(విజయవాడతూర్పు): నలంద డిగ్రీ కళాశాల్లోని బెంగళూరుకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ మేనేజ్‌మెంట్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ ఎంపికల్లో కళాశాలకు చెందిన 205 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో మొదటిరౌండ్‌లోని బృంద సమావేశంలో 95 మంది ఎంపికయ్యారు. అందులో నుంచి టాస్క్‌రౌండ్‌కు 73 మంది ఎంపికయ్యారు. వీరందరికీ సంస్థ బెంగళూరులో శిక్షణ అందిస్తుందని, అనంతరం బెంగళూరు, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉద్యోగం కల్పిస్తారని ఆమె తెలిపారు. ప్లేస్‌మెంట్ అధికారి బి. చంద్రగిరి, నలంద విద్యాసంస్థల అధినేత ఎ.విజయబాబు, కమ్యూనికేషన్ స్కిల్స్ హెచ్ఓడీ బి. రజనీ ప్రదీప్, టెక్నికల్ హెడ్ యు. తిరుపతిరావు అభినందించారు.

నేడు అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలోని రావిచెట్టు సెంటర్‌లో మంగళవారం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ట్రస్ట్ సభ్యులు షేక్ షఫీవుల్లా, మల్లిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని వారు కోరారు.

మహాత్ముని జీవితం ఆదర్శప్రాయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహాత్ముని జీవితం ఆదర్శప్రాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పాలప్రాజెక్టు సమీపంలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల ఆవరణలోని గాంధీ దేవాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) అసిస్టెంట్ సూపరిండెంటెంట్ డేగ ప్రభాకర్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సరళ, సీనియర్ సిటిజన్స్ సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్టు డైరెక్టర్లు తమ్మిన సోనియా, తమ్మిన హనుమ, సయ్యద్ అప్పలస్వామి కళాశాల పాలక వర్గ సభ్యులు తమ్మిన మారుతీ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ రాంపండు నాయక్ పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న డేగ ప్రభాకర్

గాంధీ సత్యాగ్రహం ప్రపంచానికే ఆదర్శం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహాత్మా గాంధీజీ నాడు నేర్పిన సత్యాగ్రహ సిద్ధాంతం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని గాంధీ దేశం ట్రస్ట్ వ్యవస్థాపకులు గాంధీ నాగరాజన్ పేర్కొన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గాంధీ జీవిత విశేషాలను వివరించిన విద్యార్థినులు తేజశ్వని, పావని దుర్గలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎ మాతంగి కోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



హోల్‌సేల్ కాంప్లెక్స్‌లో గాంధీజీకి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

మహాత్మా గాంధీ హోల్‌సేల్ కాంప్లెక్స్‌లో..

గొల్లపూడి పరిధిలో మహాత్మా గాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి నాగేశ్వరరావు, కాసుల వెంకట నారాయణ, ఉపాధ్యక్షులు వెలగపూడి శంకరబాబు, అన్నవరపు పార్థసారధి, కోశాధికారి నంబూరు సాంబశివరావు, కార్యదర్శి బచ్చు రమేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సైన్స్ మరింత అభివృద్ధి చెందాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో మానవత్వంకోసం సైన్స్ మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరముందని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ అన్నారు. అమరావతి బాలోత్సవం ఐదో పిల్లల పండగలో భాగంగా కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో 'విద్యార్థులు-సైన్స్', 'విద్యార్థులు-శాస్త్రీయ ఆలోచన' అంశాలపై సదస్సులను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. పరిశీలనత్మక దృక్పథాన్ని పెంచుకోవాలన్నారు. భావోద్వేగాలు, జిజ్ఞాస, సామాజిక నడవడిక వంటి అంశాల కలిగి ఉన్నప్పుడు విద్యార్థులు మరింత ఉన్నతిని సాధిస్తారన్నారు. ఎంతో మంది శాస్త్రవేత్తలను సమాజం ఆమోదించలేదన్నారు. కలలను వాస్తవ రూపంలోకి తీసుకొచ్చేందుకు సైన్స్ దోహదం చేస్తుందన్నారు. వివక్షపూరిత విద్యా మానవ సమాజానికి మేలు చేయదన్నారు. జనవిజ్ఞాన వేదిక నేత డాక్టర్ చల్లా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పదాన్ని పెంపొందించుకున్నప్పుడే సరైన మార్గంలో ముందుకు సాగుతారన్నారు. సభకు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు అధ్యక్షత వహించారు. బాలోత్సవ్ అధ్యక్షుడు ఎస్వీ రామరాజు, సభ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, జ్యోత్సన, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వల్లభరావు ప్రసంగించారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకుమార్

కుష్ఠు వ్యాధి లక్షణాలను గుర్తించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): కుష్ఠు వ్యాధి నివారణకు ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా తగిన చర్యలు తీసుకుంటుందని, అయితే ఆ వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్యుని సంప్రదిస్తే వ్యాధిని త్వరితగతిన నివారించవచ్చని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అన్నారు. కుష్ఠు నివారణపై అవగాహన కల్పించే స్పర్శ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యాధరపురం లేబర్‌కాలనీలోగల కల్యాణమండపంలో వైద్యులు బీ వసుంధర, షీబీ ఆధ్వర్యంలో సోమవారం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ రత్నకుమారి మాట్లాడుతూ చర్మంపై కొత్త మచ్చలు కనిపిస్తే తక్షణమే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. కుష్ఠు లక్షణాలపై అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరి 13వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. డాక్టర్ షీబా మాట్లాడుతూ ప్రజల వ్యక్తిగత ఆరోగ్యంపై ఆశా వర్కర్లు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ రత్నకుమారి

గొల్లపూడి సచివాలయంలో..

విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని గ్రామ సచివాలయం-2లో స్పర్శ కార్యక్రమంలో భాగంగా వైస్ ఎంపీపీ వేమూరి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుష్ఠు నివారణ అవగాహన కార్యక్రమంలో ఆయన పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఎంపీహెచ్ఎస్ సూపర్‌వైజర్ సావిత్రి, ఏఎన్ఎం బీ రమాదేవి పాల్గొన్నారు.

తెలుగు సినీరంగ ధృవతార జమున

విజయవాడ కల్చరల్: తెలుగు సినీ రంగ ధృవతార సినీ నటి జమున అని విద్యావేత్త నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్ర కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద సోమవారం జమున సంతాప సభ, సినీ స్వరనీరాజనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలుగు సినీ రంగ చరిత్రలో ఆమె అనేక విజయవంతమైన చిత్రాలలో నటించినట్లు తెలిపారు. అగ్ర సినీ నటులతో కలసి నటించారన్నారు. కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ ఆమె నాటక అకాడమీ చైర్మన్‌గా ఆమె కళాకారుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలలో ప్రారంభమైన ఆమె సినీ రంగ ప్రస్థానం విజయవంతంగా ముగిసిందన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ నగరంతో ఆమెకు విడదీయలేని అనుబంధం ఉందన్నారు. మద్రాస్‌నుంచి సినీరంగాన్ని హైదరాబాద్‌కు రావడంలో కృషి చేసినట్లు తెలిపారు. విజయలక్ష్మి ఆధ్వర్యంలో గాయకులు ఉమాబలరాం, వీ కామేశ్వరి, సుధారాణి, విష్ణు ప్రియ, డేవిడ్ రాజు జమున నటించిన చిత్రాలలోని పాటలను ఆలపించారు. కళాకారులు గాయనీ గాయకులు, నిర్వాహకులు జమున చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు.



సినీ నటి జమున సంతాప సభలో పాల్గొన్న గాయకులు

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాపాయానికి దూరంగా ఉండాలని ఎస్ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఎస్ఎన్‌పురం, 3 ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా బీఆర్టీఎస్ రోడ్డులో హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రాణం అమూల్యమైనదని, ప్రమాదాలు జరిగినప్పుడు తలకు బలమైన గాయమై ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవడం ద్వారా వారిపై ఆధారపడే కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు షరీఫ్, దుర్గామహేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టెక్నోసిన్-2023

గుణదల(విజయవాడ తూర్పు): టెక్నోసిస్-2023లో భాగంగా జాతీయ స్థాయి క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్-పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు విజయవాడలోని ఆంధ్రా లయోల కాలేజీలో సోమవారం ఉత్సాహంగా జరిగాయి. లయోల కాలేజీ ఎలక్ట్రానిక్స్ విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 15 డిగ్రీ కళాశాలలు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చాయి. ఉత్సాహభరితంగా సాగిన పోటీల క్విజ్ విభాగంలో సీఆర్ రెడ్డి కాలేజీ(ఏలూరు), ఎస్ఆర్ఆర్, సీవీఆర్ కాలేజీ(విజయవాడ) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. అదేవిధంగా పేపర్ ప్రజెంటేషన్‌లో నలంద డిగ్రీ కాలేజీ(విజయవాడ), మేరీస్ స్టెల్లా(విజయవాడ), పోస్టర్ ప్రజెంటేషన్‌లో కేబీఎన్ డిగ్రీ కాలేజీ(విజయవాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(అవనిగడ్డ), ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్ట్ డిస్‌ప్లేక్ష కేబీఎన్ కాలేజీ(విజయవాడ), పీబీ సిద్ధార్థ కాలేజీ(విజయవాడ) వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నాయి. విజేతలకు బీఎస్ఎన్ఎల్ ఏజీఎం పి.రాజు, లయోల కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఎ.పి.కిషోర్, కరస్పాండెంట్ నగయరాజ్ బహుమతులు అందజేశారు.

బైక్ చోరీపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డుపై పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు కొత్తపేట పోతిన ఆదియ్య వీధికి చెందిన మజ్జి అప్పారావు ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. అప్పారావుకు ఆరు నెలల కిందట అత్తగారు యమహా బైక్‌ను కొన్ని ఇచ్చారు. అప్పారావు ఇల్లు కొండపై కావడంతో లాలీమ బార్ సమీపంలో నివాసం ఉండే తన స్నేహితుడైన అర్జున్ ఇంటి ముందు పెట్టి తాళం వేస్తుంటాడు. ఈ నెల 24వ తేదీన బైక్‌ను అర్జున్ వాళ్ల ఇంటి ముందు పెట్టి తాళం వేశాడు. మరుసటి రోజు వచ్చి చూసే సరికి బైక్ కనిపించకపోవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రామరాజ్యనగర్ కబేళా విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ విద్యాధరపురం ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు లేబర్‌కాలనీ, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, భారత్ గ్యాస్ కంపెనీ రోడ్, అప్పలస్వామి క్వారీ, కేసీ పబ్లిక్ స్కూల్ రోడ్, అరవింద వీధి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

భవానీపురం పరిధిలో..

భవానీపురం పరిధిలోని 11 కేవీ భవానీపురం ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా మంగళవారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు ఎంఐజీ-1 బ్లాకులు, స్వాతీ థియేటర్ రోడ్, మానవ మందిరం రోడ్, అమృత అపార్ట్‌మెంట్ రోడ్, పోపూరివారి వీధి, హనుమయ్య వీధి, గుడివాడ రామారావు వీధి, ప్రసాద్ హోటల్ రోడ్, లత హాస్పిటల్ రోడ్, మంగళగిరి పరాంకుశం దాస్ వీధి, ఆకుల రాజేశ్వరరావు మిల్ రోడ్, చెట్ల బజార్ ప్రాంతాల్లో ఆయా సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

నేడు వీఎంసీ కౌన్సిల్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాభివృద్ధిపై పలు నిర్ణయాలు తీసుకునేందుకు పాలకపక్షం మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీ కౌన్సిల్ మంగళవారం నిర్వహించనున్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కౌన్సిల్‌లో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పలు అంశాలపై నిర్ణయం తీసుకోనున్నారు.

లలితాంబికా పీఠంలో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు



రాజ్యశ్యామలా హోమం నిర్వహిస్తున్న పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లలితాంబికా పీఠంలో నిర్వహిస్తున్న శ్యామలాదేవి నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. శ్యామలాదేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. తొలుత పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ రాజ్యశ్యామలా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, పండ్ల రసాలు, పసుపు, కుంకుమ, మూలికా జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాజ్యశ్యామలా దేవి హోమం నిర్వహించిన అనంతరం మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, హోమాలను నిర్వహించినట్లు పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పేర్కొన్నారు.

ఆర్చరీలో సత్తాచాటిన డివిజన్ ఉద్యోగులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆల్ ఇండియా రైల్వే ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో విజయవాడ డివిజన్ ఉద్యోగులు ఒక బంగారు, రెండు కాంస్య పతకాలు సాధించారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు చిత్తరాజన్‌లో జరుగుతున్న 12వ ఆల్ ఇండియా రైల్వే ఆర్చరరీ చాంపియన్‌షిప్‌లో కమర్షియల్ విభాగంలో ఆఫీస్ సూపరింటెండెంట్ వై.చరణ్‌రెడ్డి, ఎస్ అండ్ టి విభాగంలో హెల్పర్ సునేందు రాయ్‌లు దక్షిణ మధ్య రైల్వే ఆర్చరీ టీంకు ప్రాతినిధ్యం వహించారు. ఈ ఈవెంట్‌లో అద్భుతమైన ప్రదర్శనతో చరణ్‌రెడ్డి ర్యాంకింగ్ రౌండ్‌లో బంగారు పతకం సాధించగా, ర్యాంకింగ్, ఎలిమినేషన్ (ఒలింపిక్) రౌండ్‌లో సురేందురాయ్ రెండు కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు డీఆర్ఎం శివేంద్రమోహన్, ఏడీఆర్ఎంలు ఎం.శ్రీకాంత్, డి.శ్రీనివాసరావు, డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్, సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర బిటి, సీనియర్ డీపీఓ ముత్యాల బాలమురళీధర్ విజేతలకు అభినందనలు తెలియజేశారు.



ఆర్చరీలో బంగారు, కాంస్య పతకాలు సాధించిన చరణ్‌రెడ్డి, సునేందురాయ్

మొబైల్ టాయిలెట్లు ఏర్పాటుచేయండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్క్రూబ్రిడ్జి కింద తాత్కాలికంగా మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటుచేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ పుప్పల నరసకుమారి, అధికారులతో కలసి సర్కిల్-3 పరిధిలోని 15, 21వ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. 15వ డివిజన్‌లోని వంగవీటి మోహనరంగా పార్కును పరిశీలించి లోపల షెడ్డును గ్రంథాలయంగా మార్చాలని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ సూచించారు. దీనికి తగిన చర్యలు తీసుకోవాలని, పార్కులో గ్రీనరీని అభివృద్ధి చేయాలని ఉద్యానవన విభాగం అధికారులకు సూచించారు. అనంతరం ఆయన 21వ డివిజన్‌లోని పద్మావతి ఘాట్‌లో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ ను త్వరగా పూర్తి చేయాలని, స్థానికంగా పార్కును, గ్రీనరీని, పిల్లల ఆట పరికరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తర్వాత కృష్ణలంక శివశంకరపురం బర్మా సీతారామయ్య నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రాథమిక స్కూల్‌ను పరిశీలించారు. పాఠశాల్లో పిల్లలు తక్కువగా ఉండటం గమనించిన ఆయన విద్యార్థులను వేరే స్కూలుకు మార్చి పాఠశాల భవనాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.



స్క్రూబ్రిడ్జి వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఫిబ్రవరి ఆరో తేదీ వరకూ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు తెలిపారు. ప్రతి ఏటా మాఘ శుద్ధ దశమి నుంచి బహుళ పాడ్యమి వరకూ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. 31వతేదీ ఉదయం స్వామికి స్నపనాభిషేకం, పెండ్లికుమారుని చేయుట సాయంత్రం విష్వక్సేన పూజ, రక్షాబంధన, అజస్ర దీపారాధన, అంకురార్పణ తదితర కార్యక్రమాలతో ఉత్సవాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. అలాగే ఫిబ్రవరి ఒకటో తేదీన యజ్ఞశాల ప్రవేశం, వాస్తుపూజ, హోమం, గరుడపట ధ్వజారోహణ, శేషవాహన సేవ, అన్నమాచార్య సంకీర్తనాగానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. రెండో తేదీన స్వామికి పారమాత్మిక హోమం, హనుమద్వాహనోత్సవం, ఎదుర్కోల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మూడో తేదీన ఉదయం విశేష అర్చన, హోమాది కార్యక్రమాలు, సాయంత్రం శ్రీ వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగో తేదీన గరుడ వాహన సేవ, సాయంత్రం శ్రీ వారి రథోత్సవాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఐదో తేదీన కృష్ణానదిలో చక్రతీర్థ స్నానం, పూర్ణాహుతి కార్యక్రమాలుంటాయని తెలిపారు. సాయంత్రం తెప్పోత్సవం, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆరో తేదీన స్వామి పుష్పయాగాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని టేనర్‌పేటలోగల కొండ ప్రాంతంలో అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగ సోమవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని యలవర్తి భిక్షాలు వీధి, పురుషోత్తం వీధి, ఐజాక్ వీధి, కాశీపతి రోడ్, బూస్టర్ వీధి, పెండెం రాములు, జొన్నలగడ్డ మస్తాన్ వీధుల్లో రూ.19.80 లక్షల వ్యయంతో మెట్లు, ర్యాంప్‌తోపాటు సైడ్ డ్రైయిన్స్ నిర్మాణ పనులను మొదలు పెట్టామని తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును కొండ ప్రాంతవాసులు కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా సాధ్యమైనంత వరకు వాటిని అక్కడిక్కడే పరిష్కరిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు గోదావరి బాబు, కూరాకుల నాగ, కామళ్ల జోజి, తాంద్ర ఇంద్ర, యరజర్ల మురళి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభించిన గోదావరి గంగ

పేదలకు సాయం చేయడం భగవంతుడి సేవతో సమానం

వించిపేట(విజయవాడపశ్చిమ): భగవంతుడు తమకు ఇచ్చిన దాంట్లోనే కొంత సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు చేయూత అందించడం భగవంతునికి చేసే సేవతో సమానమని జ్ఞానయజ్ఞం ట్రస్ట్ చైర్మన్ తిరుపతిరావు పేర్కొన్నారు. ఇటివల కొత్తపేటలో నివాసముండే లారీ డ్రైవరు ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి కిందపడటంతో వెన్నుపూస దెబ్బతిని మంచానికే పరిమితమయ్యాడు. అతడి తల్లి కూడా గుండె సంబంధిత వ్యాధితో బాదపడుతోంది. లారీ డ్రైవరు మంచాన పడడంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరి పరిస్థితిని తెలుసుకున్న జ్ఞానయజ్ఞం ట్రస్ట్ సభ్యులు అతడి చికిత్స నిమిత్తం రూ.7వేల విలువ చేసిన మందులను అందజేశారు.



చికిత్స పొందుతున్న వ్యక్తికి మందులు అందజేస్తున్న తిరుపతిరావు

జాతీయ ఆర్చరీ క్రీడాకారిణికి సన్మానం

గుణదల(విజయవాడ తూర్పు): సీబీఎస్‌సీ స్కూల్ ఆర్చరీ దక్షిణ భారత పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కె.చంద్రహాసినిని విజయవాడ గుణదలలోని సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.రమాభారతి ఘనం సత్కరించారు. ఆమె మాట్లాడుతూ దక్షిణ భారత పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు ఎంపికైన చంద్రహాసిని తమ పాఠశాల విద్యార్థిని కావడం సంతోషంగా ఉందన్నారు. భారత జట్టు చెస్ కోచ్ వి.ఆర్.బొబ్బా ఈ కార్యక్రమంలో పాల్గొని ఖెస్ పోటీల్లో పతకాలు సాధించిన ఎన్.వర్షిత్, జూహిప్రణవ్, నిశ్చల్, నందిక, భార్గవిపాల్, రమేష్‌రెడ్డి, భరత్‌ను అభినందించారు.



చంద్రహాసినిని సన్మానిస్తున్న దృశ్యం